క్లుప్తంగా

కళాకారుని కుటుంబానికి ఆర్థిక సాయం



మండపల్లిలో మృతుడి భార్యకు ఆర్థిక సాయం అందజేస్తున్న ప్రసాద్ తదితరులు

కొత్తపేట: కళాప్రవంతి సంగీత, వాయిద్య, నృత్య కళాకారుల సంక్షేమ సంఘం సమావేశం బుధవారం మండలంలోని పలివెల కళా భవనంలో జరిగింది. సంఘ అధ్యక్షుడు కొమారిపాటి ఏసువెంకటప్రసాద్ అధ్యక్షతన జరిగిన సమావేశంలో కళాకారులకు గుర్తింపు కార్డులు, ఇళ్ల నిర్మాణం తదితర అంశాలపై చర్చించారు. త్వరలో ఏర్పడే నూతన ప్రభుత్వం దృష్టికి ఈ అంశాలనే తీసుకువెళ్లి సాధించుకోవాలని తీర్మానించారు. ఇటీవల అనారోగ్యంతో మృతి చెందిన సెట్టిపేట చిన్న (36) అనే కళాకారుడు కుటుంబానికి సంఘం తరఫున రూ.10 వేల సాయం అందించాలని తీర్మానించారు. ఆమేరకు మండపల్లి గ్రామం వెళ్లి మృతుడు చిన్న భార్య సత్యవతికి పై ఆర్థిక సాయం అందించారు. ఈ కార్యక్రమంలో సంఘ సభ్యులు, కళాకారులు పాల్గొన్నారు.

సత్తిబాబు కుటుంబానికి పరామర్శ



సత్తిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పిస్తున్న ఎమ్మెల్యే అభ్యర్థి వేణుగోపాలరావు

అంబాజీపేట: మాచవరం శివారు జయంతినగర్‌కు చెందిన సిర్ర సత్యనారాయణ (సత్తిబాబు) అకాల మరణానికి చింతిస్తూ అతని కుటుంబ సభ్యులను ఎమ్మెల్యే అభ్యర్థి విప్పర్తి వేణుగోపాలరావు, వైఎస్సార్ సీపీ రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి నేలపూడి స్టాలిన్‌బాబులతో పాటు పలువురు బుధవారం పరామర్శించారు. సత్తిబాబు కుటుంబాన్ని అన్ని విధాలా ఆదుకుంటామని అతని కుటుంబీకులకు మనోధైర్యం కల్పించారు. అనంతరం సత్తిబాబు చిత్రపటం వద్ద నివాళులర్పించి, శ్రద్ధాంజలి ఘటించారు.

నాగేంద్ర స్వామి కల్యాణం



పుల్లేటికుర్రులో నాగేంద్ర స్వామి పుట్ట

అంబాజీపేట: పుల్లేటికుర్రు యూనియన్ బ్యాంక్ పక్కన పంట కాలువ రోడ్డులో వేంచేసియున్న శ్రీ నాగేంద్ర స్వామి వారి పుట్ట కల్యాణ మహోత్సవాన్ని బుధవారం నిర్వహించారు. పాణింగపల్లి నాగ వెంకట మురళీ ప్రకాశ్-శైలజ దంపతుల ఆధ్వర్యంలో స్వామి వారి కల్యాణం జరిపించారు. పూర్వం నుండి ఏటా ఈ పుట్ట వద్ద నాగులచవితికి విశేష పూజలు నిర్వహిస్తారు. స్వామి కల్యాణాన్ని పురస్కరించుకుని అన్న సమారాధన చేపట్టారు.

సీనియర్ అసిస్టెంట్ బాబులు మృతికి సంతాపం

సఖినేటిపల్లి: సుదీర్ఘ కాలం అంతర్వేది దేవస్థానం వీఆర్వోగా పనిచేసిన పూర్వ బీజేపీ నాయకుడు, ప్రస్తుతం మలికిపురం తహసీల్దార్ కార్యాలయం సీనియర్ అసిస్టెంట్ గా విధులు నిర్వహిస్తున్న పోతురాజు వెంకట నరసింహ కుమార్(బాబులు)ఆకస్మిక మృతికి మాజీ ఎమ్మెల్యే మానేపల్లి అయ్యాజీ వేమా తీవ్ర సంతాపం వ్యక్తం చేశారు. బుధవారం అంతర్వేదికరలో బాబులు కుటుంబ సభ్యులను వేమా పరామర్శించారు. వారికి ప్రగాఢ సానుభూతి తెలిపారు. పార్టీ జిల్లా అధికార ప్రతినిధి మాలే శ్రీనివాస నగేష్, రాష్ట్ర కిసాన్ మోర్చా డ్రైయినేజీ సెల్ కన్వీనర్ చెంపాటి శివరామకృష్ణంరాజు, నియోజకవర్గ కన్వీనర్ అడబాల రాంబాబు, పార్టీ మండల అధ్యక్షుడు పట్టపు సూర్య ప్రకాశరావు, నాయకులు చెల్లింగి త్రినాథ్, పోతురాజు సురేష్ పాల్గొన్నారు.

నేడు విద్యుత్ సరఫరాకు అంతరాయం

రావులపాలెం: విద్యుత్ లైన మరమ్మతుల నిమిత్తం గురువారం మండలంలోని ఈతకోట సబ్‌స్టేషన్ పరిధిలో ఉదయం ఏడు గంటల నుంచి మధ్యాహ్నం 12 గంటల వరకు విద్యుత్ సరఫరా నిలిపివేస్తున్నట్టు ట్రాన్స్‌కో ఎగ్జిక్యూటివ్ ఇంజినీర్ ఎం.రవికుమార్ బుధవారం తెలిపారు. ఫీడర్ లైన్ మరమ్మతుల కోసం గోపాలపురం, ఈతకోట, ముమ్మిడివరప్పాడు, లక్ష్మీపోలవరం, పొడగట్లపల్లి, మట్లదొడ్డి, దేవరపల్లి, వేదిరేశ్వరం, కోసూరినగర్, గరువు, కేతరాజుపల్లి, చెల్లిరేవు ప్రాంతాల్లో సరఫరా ఉండదని వినియోగదారులు సహకరించాలని ఆయన కోరారు.

కూలీలకు ధీమా.. ఉపాధి హామీ

- పెరిగిన వేతనంతో కూలీల్లో ఆనందోత్సాహం
- ఏప్రిల్ నుంచి రూ.300కు పెంపు
- గతేడాది రూ.102.95 కోట్ల చెల్లింపు



ఆలమూరులో ఉపాధి పనులు చేపడుతున్న కూలీలు

ఆలమూరు: కేంద్ర ప్రభుత్వం సహకారంతో రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న ఉపాధి హామీ పథకం నిరుపేద కూలీల జీవితాల్లో వెలుగులు నింపుతుంది. పేదల సంక్షేమానికి, ఆర్థికాభివృద్ధికి ఎంతగానో దోహదపడుతుంది. క్లస్టర్ పరిధిలోని కొత్తపేట నియోజకవర్గంలో ఇప్పటికే వ్యవసాయ పనులు చురుగ్గా జరగుతుండగా రాజోలు, పి.గన్నవరం నియోజకవర్గాల్లో రైతులు తమ పొలాల్లో వరి కోతలకు సమాయత్తమవుతున్నారు. ప్రస్తుతం వ్యవసాయ పనులు ఊపందుకోవడంతో కూలీలందరూ బిజీగా ఉన్నారు. ఈ వ్యవసాయ పనులు అనంతరం కూలీలకు ఎన్ఆర్‌జీఈఎస్ కింద పనులు కల్పించి జీవనోపాధికి ఊతమిచ్చేందుకు ఎన్ఆర్ఈజీఎస్ అధికారులు సమగ్ర చర్యలు చేపట్టారు. ఈ ఏడాది ఏప్రిల్ ఒకటి నుంచి ఉపాధి కూలీలకు ఉన్న కనీస వేతనం రూ.272 నుంచి రూ.300కు పెరిగింది. దీంతో ఒక్కో కూలీకి రోజుకు సగటున రూ.28 పెరిగినట్లయింది. క్లస్టర్ పరిధిలోని మూడు నియోజకవర్గాల్లో 11 మండలాలు ఉండగా అందులో 182 గ్రామాలు ఉన్నాయి. ఎన్ఆర్‌జీఈఎస్ పథకం కింద 183,185 కుటుంబాలు ఆయా గ్రామ పంచాయతీల్లో ఉపాధి హామీ పనులు చేపడుతున్నారు. జగనన్న ఇళ్ల నిర్మాణ పథకంలో భాగంగా ఒక్కో ఇంటి నిర్మాణానికి 90 రోజుల వంతున పనిదినాలు కల్పిస్తున్నారు. దీంతో పాటుగా, కాలువలు, చెరువుల్లో పూడికతీత పనులు, ఎవెన్యూ ప్లాంటేషన్, హార్టీకల్చర్ ప్లాంటేషన్, బ్లాక్ ప్లాంటేషన్ తదితర పనులు ఆయా ప్రాంతాల్లో చేపడుతున్నారు. ఉపాధి హామీ పథకం నిబంధనల మేరకు, అధికారులు ఇచ్చిన కొలతల మేరకు పనిచేస్తేనే పూర్తి వేతనం రూ.300 లభిస్తుందని అధికారులు చెబుతున్నారు

మండలం	జాబ్‌కార్డులు	కూలీలు	కల్పించిన పనిదినాలు	చెల్లించిన వేతనాలు రూ.
ఆలమూరు	15843	17,943	2,37,500	09.97,02,000
కొత్తపేట	17996	16,867	2,81,030	10,45,72,000
ఆత్రేయపురం	15883	16,648	2,40,809	10,35,66,000
రావులపాలెం	13992	14,674	1,98,590	09,65,45,000
రాజోలు	12565	13,769	1,63,147	06,69,18,000
సఖినేటిపల్లి	18605	19,932	2,47,606	08,21,47,000
మలికిపురం	17505	19,217	2,76,015	08,77,10,000
పి.గన్నవరం	25,987	26,558	3,04,303	11,84,62,000
అయినవిల్లి	27,183	28,265	3,16,888	10,57,27,000
మామిడికుదురు	13588	14,161	1,65,952	05,80,84,000
అంబాజీపేట	22593	24,654	2,81,505	10,61,14,000
	183,135	2,13,688	26,64,985	102, 95,47,000

ఉపాధి కూలీలకు సగటు వేతనం పెరిగింది

ఉపాధి హామీ పథకం పనులు చేసే కూలీలకు సగటు వేతనం రూ.272 వరకూ పెరిగింది. పనులు చేసే కొలతలను బట్టి సగటు వేతనాన్ని ఎన్ఆర్‌జీఈఎస్ అధికారులు, సిబ్బంది నిర్ణయిస్తారు. కనీస వేతనం రూ.300 ఉండగా సగటు వేతనం రూ.283 వరకూ వస్తోంది. కనీస వేతనం పెంపుదల వల్ల సగటు వేతనం మరింత పెరిగే అవకాశం ఉంది. 2023-24 ఆర్థిక సంవత్సరం మార్చి 31వ తేదీతో ముగియగా 2024-15 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి ఏప్రిల్ ఒకటి నుంచి కొత్త వేతనంలో ఉపాధి కూలీలకు పనులు ప్రారంభమయ్యాయి. ఉపాధి పనులు చేసిన సత్వరమే కూలీల ఖతాల్లో వేతన సొమ్ము జమ అవుతుంది. గత ఆర్థిక సంవత్సరంలో కూలీలకు వేతనాలు, మెటీరియల్ రూపంలో రూ.100,29,54,700లు చెల్లింపులు చేశారు. అందులో మెటీరియల్ రూపంలో రూ.27,71,75,000, వేతనాల రూపంలో కూలీలకురూ.75,23,72,000లు చెల్లింపులు చేపట్టారు.

ఉపాధి కూలీలకు కనీస సౌకర్యాలు

ఉపాధి కూలీలకు మునుపెన్నడూ లేని విధంగా రాష్ట్ర ప్రభుత్వం కనీస సౌకర్యాలను కల్పిస్తుంది. పని ఒత్తిడి వల్ల అలసిన కూలీలకు ఓఆర్ఎస్ ద్రావణాన్ని అందించడంతో పాటు దాతల సహకారంతో మజ్జిగ సరఫరా చేస్తున్నారు. అలాగే ఎండ తీవ్రత నుంచి ఉపశమనం పొందేందుకు వీలుగా గుడారాలను ఏర్పాటు చేస్తున్నారు. తాగునీరును అందుబాటులో ఉంచుతున్నారు. ఉపాధి పనులు చేసేటప్పుడు ఎప్పటికప్పుడు ఎన్ఆర్‌జీఈఎస్ సిబ్బంది ఆరోగ్య పరిరక్షణపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నారు. ఉపాధి కూలీలకు పెరిగిన వేతనంతో పాటు కనీస సౌకర్యాలను కల్పించడంపై సర్వత్రా హర్షాతిరేకాలు వ్యక్తమవుతున్నాయి.

ఉపాధి కూలీలకు ప్రయోజనకరంగా ఉంటుంది



ఎన్ఆర్‌జీఈఎస్ పథకంలో పనిచేస్తున్న కూలీలకు కనీస వేతనం పెరిగింది. దీంతో కూలీలందరకి రూ 28 మేర లబ్ధి చేకూరినట్లయ్యింది. కూలీలు పని చేసే దానిని బట్టి వారి సగటు వేతనం పెరిగే అవకాశాలు అధికంగా ఉన్నాయి. దీనివల్ల కూలీలకు జీవన ప్రమాణాలు మరింత మెరుగుపడే అవకాశం ఉంది.

– పీవీవీ ప్రసాద్, ఏపీఓ, ఆలమూరు

పెరిగిన వేతనంతో ఎంతో మేలు



ఉపాధి హామీ పథకంలో వేతనం పెరగడం పట్ల తమ లాంటి కూలీలకు ఎంతో మేలు జరగుతుంది. ప్రతియేటా వంద రోజులు పనికల్పిస్తూ కనీసం వేతనం అందిస్తున్న కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు కృతజ్ఞతలు తెలియజేస్తున్నాను.

– గొల్లపల్లి సహదేవుడు, ఉపాధి కూలీ, ఆలమూరు

ముందస్తుగా ఎండు గడ్డి సేకరణ



మొసలపల్లిలో యంత్రంతో చుట్టిన గడ్డి బేళ్లు

అంబాజీపేట: వరద ప్రభావిత ప్రాంతాల్లోను, రానున్న వర్షాకాలంలో పశుపోషణకు గడ్డి కొరత లేకుండా ముందస్తుగా రైతులు ఎండు గడ్డి సేకరిస్తున్నారు. అయితే గతంలో మెసీన్‌తో గాని, కూలీలతో గాని వరి కోతలు కోసేవారు. ఎండు గడ్డిని మేటులు వేసి భద్రపరుచుకునే వారు. వాతావరణంలో మార్పుల కారణం ఒకటైతే ప్రస్తుత కాలంలో కూలీల కొరత ఎక్కువగా ఉండటంతో మెషీన్‌తో కోసిన గడ్డిని యంత్ర సాయంతో 35 కేజీల బేళ్లుగా తయారు చేసి మేట్‌లు వేస్తున్నారు. అదే గడ్డిమేటు వేయాలంటే ప్రస్తుతం ఎకరానికి గడ్డి రూ.4 వేలు, మేటు వేయడానికి రూ.4 వేలు ఖర్చవుతున్నాయని అదే బేళ్ల రూపంలో మేట్‌లు వేయడం వల్ల ఖర్చులు ఆదా అవుతున్నాయని రైతులు చెబుతున్నారు. ఇదిలా ఉండగా వరద ప్రభావిత ప్రాంతాల్లో పశువులకు ఎండుగడ్డి కొరత లేకుండా బేళ్లను సిద్ధం చేసి ఆయా గ్రామాల్లో ఉన్న ఆర్బీకేల్లో భద్రపరుస్తున్నామని అధికారులు చెబుతున్నారు. ఒక పక్క ధాన్యం రాశులను సంరక్షించుకుంటూ, పశువులకు ఎండు గడ్డిని ఒడ్డుకు చేర్చుకుంటున్నారు రైతన్నలు.

45 మంది రక్తదానం



మొగలికుదురులో రక్తదానం చేస్తున్న యువకులు

మామిడికుదురు: బ్రైట్ స్టోన్స్ పర్యవేక్షణలో బుద్దాల నాగరత్నం మెమోరియల్ వాలంటరీ బ్లడ్ సెంటర్, సహస్ర బ్లడ్ బ్యాంకు ఆధ్వర్యంలో బుధవారం మొగలికుదురులోని శ్రీసత్యసాయి కల్యాణ మంటపంలో ఉచిత మెగా రక్తదాన శిబిరం జరిగింది. ఈ శిబిరంలో పలువురు యువకులు ఉత్సాహంగా పాల్గొని రక్తదానం చేశారు. సుమారు 45 మంది రక్తదానం చేశారని నిర్వాహకులు తెలిపారు. దీంతో పాటు ఉచితంగా బ్లడ్ గ్రూప్ నిర్ధారణ, హిమోగ్లోబిన్ పరీక్షలు చేశారు. నిర్వాహకులు మాట్లాడుతూ ఆపద సమయంలో రక్తం కోసం ఎంతో మంది ఎదురు చూస్తూ ఇబ్బందులు పడుతున్నారన్నారు. రక్తదానం కార్యక్రమంలో యువకులు ముందుకు రావాలని సూచించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు కడి శ్రీను, యక్కల మోహర్, మానెం కమలేశ్వరరావు, నిర్వాహకులు బిళ్ల తేజ, బిళ్ల గణేష్, ఊటుకూరి మాణిక్యనాగబాబు, చెల్లింగి కృష్ణ, కొండా చినబాబి, గుంటు మోహన్‌ఈశ్వరరావు పాల్గొన్నారు.

మహిళా ఓటర్లు ఎక్కువ.. పోలింగ్ తక్కువ



కొత్తపేటలో మహిళా ఓటర్లు (ఫైల్)

మండలాల వారీగా పోలింగ్ వివరాలిలా ఉన్నాయి

మండలం	పురుషులు	స్త్రీలు	ఇతరులు	మొత్తం	పోలింగ్ శాతం
ఆత్రేయపురం	23,746	23,291	0	47,037	86.04
రావులపాలెం	29,496	30,507	2	60,005	82.24
కొత్తపేట	28,100	27,369	1	55,470	85.52
ఆలమూరు	26,420	26,043	0	52,463	87.59
మొత్తం	1,07,762	1,07,210	3	2,14,975	85.18

కొత్తపేట: అసెంబ్లీ నియోజకవర్గ ఓటర్లలో పురుషుల కంటే స్త్రీలు ఎక్కువగా ఉన్నప్పటికీ పోలింగ్‌లో మాత్రం స్త్రీల పోలింగ్ శాతం తగ్గింది. నియోజకవర్గంలో మొత్తం ఓటర్లు 2,52,383 మంది కాగా సోమవారం జరిగిన పోలింగ్‌లో మొత్తం 2,14,975 (85.18 శాతం) మంది ఓటర్లు తమ ఓటు హక్కును వినియోగించుకున్న విషయం తెలిసిందే. మొత్తం ఓటర్లలో స్త్రీలు 1,27,324 మంది, పురుషులు 1,25,053 మంది కాగా పురుషుల కంటే స్త్రీలు 2,271 మంది ఎక్కువగా ఉన్నారు. అయితే పోలింగుకు వచ్చేసరికి మహిళల ఓటర్ల శాతం తగ్గింది. స్త్రీలు 1,07,210 మంది మాత్రమే ఓటు హక్కు వినియోగించుకోగా, పురుషులు స్త్రీల కంటే ఎక్కువగా 1,07,762 మంది తమ ఓటు హక్కును వినియోగించుకున్నారు. స్త్రీల కంటే 552 మంది పురుషులు ఎక్కువగా ఓటు హక్కు వినియోగించున్నారు.

చింతలూరులో హుండీల చోరీ



చింతలూరులోని గోశాల వద్ద హుండీని ధ్వంసం చేసిన దుండుగులు

ఆలమూరు: మండలంలోని చింతలూరులో హుండీల చోరీ జరిగింది. గ్రామంలోని తూర్పు వీధి రామాయలం వద్ద, గోపరం ధామం గోశాల వద్ద ఏర్పాటు చేసిన హుండీలను గుర్తు తెలియని వ్యక్తులు బుధవారం తెల్లవారుజామున ధ్వంసం చేశారు. స్థానికుల కథనం ప్రకారం తూర్పు వీధి రామాలయంలోని హుండీని అపహరించుకు పోయారు. పక్కనే ఉన్న గోశాలలోని హుండీని పగుల గొట్టి అందులో ఉన్న నగదును తస్కరించారు. హుండీని మాత్రం ఆ ప్రదేశంలోనే ఉంచి పారిపోయారు. ఆలయ కమిటీ ప్రతినిధులు ఈమేరకు ఆలమూరు పోలీసులకు ఫిర్యాదు చేశారు. పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.

సంక్షేమ పాలనకే పట్టం



ఈదరాడలో క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేస్తున్న ఎమ్మెల్సీ ఇజ్రాయిల్

మామిడికుదురు: అభివృద్ధి, సంక్షేమ ప్రదాత సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డికి ప్రజలు అండగా నిలిచారని ఎమ్మెల్సీ బొమ్మి ఇజ్రాయిల్ పేర్కొన్నారు. జిల్లా రైతు విభాగం కార్యదర్శి చేట్ల సత్యనారాయణ ఆధ్వర్యంలో ఈదరాడలో బుధవారం జరిగిన సమావేశంలో ఎమ్మెల్సీ పాల్గొన్నారు. సంక్షేమ పాలనకు ప్రజలు పట్టం కట్టారని చెప్పారు. అందరి సంక్షేమ కోరుకున్న జగన్ రెండో సారి సీఎం కావాలని ప్రజలు ఆశీర్వదించారని చెప్పారు. భారీగా జరిగిన పోలింగ్ దానికి నిదర్శనమన్నారు. ఎమ్మెల్సీ పుట్టిన రోజును పురస్కరించుకుని స్థానికులు ఏర్పాటు చేసిన కేక్ కోశారు. క్రీడాకారులకు క్రికెట్ కిట్లు అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ కుసుమ వనజకుమారి, సర్పంచ్ చుట్టుగుళ్ల లక్ష్మి, ఎంపీటీసీ బయ్యా సునీత, పార్టీ నాయకులు యెరుబండి సూరిబాబు, వడ్డే ఆదిబాబు, మద్దుల వరలక్ష్మి తదితరులు పాల్గొన్నారు. అలాగే పి.గన్నవరంలోనూ ఎమ్మెల్సీ ఇజ్రాయిల్ బర్త్‌డే వేడుకలు నిర్వహించారు.

నిత్యాన్నదానానికి రూ.10 వేల విరాళం



దాత కుటుంబానికి స్వామి చిత్రపటం అందిస్తున్న ఆలయ ఉద్యోగులు

మామిడికుదురు: అప్పనపల్లి బాల బాలాజీ స్వామి వారి నిత్యాన్నదాన ట్రస్టుకు బుధవారం అదే గ్రామానికి చెందిన ఆలయ ధర్మకర్తల మండలి సభ్యుడు గూటం శ్రీనివాస్‌రావు, నాగలక్ష్మిభారతి దంపతులు రూ.10,116 విరాళంగా అందించారు. ఈ విరాళాన్ని దాత కుటుంబం ఆలయ అధికారులకు అందజేశారు. విరాళం అందించిన దాతలకు ఆలయ ఉద్యోగులు స్వామి వారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

కిడ్నీ వ్యాధిగ్రస్తునికి చేయూత

అయినవిల్లి: కిడ్నీ వ్యాధితో బాధపడుతున్న మండలంలోని మాగం గ్రామానికి చెందిన అంబటి నరసింహమూర్తికి సూరపరెడ్డి సురేష్ బుధవారం చేయూత నందించారు. నరసింహమూర్తి కష్టాలు తెలుసుకున్న ఉప్పలగుప్తం మండలానికి చెందిన సురేష్ ఆధ్వర్యంలో గారపాటి రిషిబాబు, రవి సత్యనారాయణ, నాగదుర్గలు బాబి మాస్టర్ చేతుల మీదుగా నెల రోజులకు సరిపడా నిత్యావసరాలను అందజేశారు. వీరిని వివేకానంద సేవా సమితి సభ్యులు అభినందించారు.

అపర భగీరథుడు కాటన్

- ఘనంగా కాటన్ జయంతి
- నివాళులర్పించిన నాయకులు



పి.గన్నవరం తహసీల్దార్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి నివాళులు అర్పిస్తున్న ఆర్‌ఓ శ్రీరామచంద్రమూర్తి

మామిడికుదురు: సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడిని ప్రతి ఒక్కరూ నిత్యం స్మరించుకోవాలని పాశర్లపూడికి చెందిన రైతు కుసుమ అప్పారావు పేర్కొన్నారు. కాటన్ జయంతి పురస్కరించుకుని మామిడికుదురు మండల రెవెన్యూ కార్యాలయం వద్ద ఉన్న విగ్రహానికి విగ్రహదాత అప్పారావు బుధవారం పూలమాల వేసి నివాళులర్పించారు. ఆయన చేసిన సేవలను కొనియాడారు. ఉభయ గోదావరి జిల్లాలకు సాగునీరు అందించి బీడు భూములను సస్యశ్యామలం చేసిన మహనీయుడు కాటన్ అని శ్లాఘించారు. పలువురు స్థానిక రైతులు పాల్గొన్నారు.

సఖినేటిపల్లిలో..

సఖినేటిపల్లి: ఉభయ గోదావరి జిల్లాల్లో లక్షలాది ఎకరాలను సస్యశ్యామలం చేసి రైతుల ఆర్థిక, జీవన స్థితిగతులను మార్చిన మహనీయుడు సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడని మోరి మహిమ కోకోనట్ ప్రొడ్యూసర్స్ కంపెనీ అధ్యక్షుడు ఓగూరి టాండన్‌రాజు అన్నారు. బుధవారం మోరిలో రైతు సంఘ నాయకుల ఆధ్వర్యంలో కాటన్ జయంతి నిర్వహించారు. గోదావరి జిల్లాలను సస్యశ్యామలం చేసిన అపరభగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ మహనీయుడని సఖినేటిపల్లి సర్పంచ్ గొల్లమందల చిట్టిబాబు అన్నారు. బుధవారం సఖినేటిపల్లి లాకుల వద్ద కాటన్ జయంతి సందర్భంగా ఆయన విగ్రహానికి చిట్టిబాబు పూలమాల వేసి నివాళులర్పించారు.

ఘనంగా కాటన్ జయంతి

పి.గన్నవరం: డెల్టా రూపశిల్పి, సర్ ఆర్థర్ కాటన్ గోదావరి జిల్లాలకు అందించిన సేవలు చిరస్మరణీయమని పి.గన్నవరం నియోజకవర్గ ఎన్నికల రిటర్నింగ్ అధికారి, జెడ్పీ సీఈఓ ఎ.శ్రీరామచంద్రమూర్తి అన్నారు. కాటన్ జయంతి సందర్భంగా స్థానిక తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల వద్ద ఆయన విగ్రహాలకు శ్రీరామచంద్రమూర్తి పూలమాలలు వేసి, నివాళులు అర్పించారు. కార్యక్రమాల్లో డిప్యూటీ తహసీల్దార్ దేవళ్ల శ్రీనివాస్, ఆర్.రామకృష్ణ, తహసీల్దార్, ఎంపీడీఓ కార్యాలయాల సిబ్బంది పాల్గొన్నారు.

కాటన్ సేవలు చిరస్మరణీయం

అంబాజీపేట: అపర భగీరథుడు, అన్నదాత సర్ ఆర్థర్ కాటన్ మహాశయుని సేవలు చిరస్మరణీయమని ఎంపీపీ దొమ్మేటి వెంకటేశ్వరరావు అన్నారు. అంబాజీపేట మండల పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ జయంతి నిర్వహించారు. కార్యక్రమంలో ఎంపీడీఓ కె.వరలక్ష్మి, కార్యాలయ సిబ్బంది పాల్గొన్నారు.

కొత్తపేటలో..


కొత్తపేట: గోదావరి జిల్లాలకు అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ అని మండల వ్యవసాయ సలహా మండలి (ఏఏబీ) చైర్మన్ పెదపూడి శ్రీనివాస్ అన్నారు. బుధవారం కాటన్ జయంతిని పురస్కరించుకుని స్థానిక మండల ప్రజా పరిషత్ కార్యాలయం వద్ద కాటన్ విగ్రహానికి ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్, స్థానిక ప్రజాప్రతినిధులు, వైఎస్సార్ సీపీ నాయకులు పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు.

నల్లచెరువులో..


అయినవిల్లి: కాటన్ జయంతిని నల్లచెరువులో పలువురు రైతు నాయకుల ఆధ్వర్యంలో ఘనంగా జరిపారు. కాటన్ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు. కాటన్ మహాశయుని సేవలను ఈ సందర్భంగా గుర్తు చేశారు. కార్యక్రమంలో సర్పంచ్ గుండుమోగుల వెంకటేశ్వరరావు, వింటి శ్రీసాయిరాం, గణేశుల రాంబాబు, గుర్రం పెద్దబ్బులు, రావూరి సూరన్న, రావూరి వెంకటరత్నం తదితరులు ఉన్నారు.

ఆలమూరులో..


ఆలమూరు: అపర భగీరథుడు సర్ ఆర్థర్ కాటన్ జయంతి వేడుకలు మండలంలోని వివిధ గ్రామాల్లో బుధవారం ఘనంగా జరిగాయి. చొప్పెల్ల లాకుల వద్ద, ఆలమూరు ఇరిగేషన్ కార్యాలయం వద్ద ఆ శాఖాధికారులు, సిబ్బంది పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. జొన్నాడ, చింతలూరు, పెనికేరు, మడికి గ్రామాల్లోని కాటన్ విగ్రహాలకు ఆయా గ్రామాల్లోని రైతులు పూలమాలలు వేసి ఘన నివాళులు అర్పించారు. అలాగే మిగతా గ్రామాల్లోని రైతులు, యువకులతో పాటు మండలంలోని వివిధ గ్రామాల ప్రజా ప్రతినిధులు, అధికారులు కాటన్ మహాశయుని జయంతి వేడుకలను అట్టహాసంగా జరుపుకొన్నారు.



సఖినేటిపల్లి లాకుల వద్ద కాటన్ విగ్రహానికి నివాళులర్పిస్తున్న చిట్టిబాబు



మామిడికుదురులో కాటన్ విగ్రహానికి పూలమాల వేస్తున్న విగ్రహదాత అప్పారావు



కొత్తపేటలో కాటన్‌కు నివాళులర్పిస్తున్న ఏఏబీ చైర్మన్ శ్రీనివాస్ తదితరులు

చిన్నారులకు టీకాలు



చిన్నారికి టీకా వేస్తున్న ఆరోగ్య సిబ్బంది

ఆలమూరు: చిన్నారులకు నిర్ణీత సమయంలో విధిగా టీకాలు వేయించాలని చొప్పెల్ల, పెదపళ్ల పీహెచ్‌సీ వైద్యాధికారులు పి.భవానీశంకర్, డి.సువర్చలాదేవి అన్నారు. ఆయా పీహెచ్‌సీల పరిధిలోని సబ్ సెంటర్లతో పాటు ఆలమూరు ప్రభుత్వ ఆస్పత్రిలో హెల్త్ సిబ్బంది బుధవారం చిన్నారులకు టీకాలను అందజేశారు. వైద్యాధికారులు ఆధ్వర్యంలో ఎంపీహెచ్ఈఓ కె.జ్యోతికుమార్, సీహెచ్‌ఓ పి.రాధాకష్ణ, హెల్త్ ఎడ్యుకేటర్లు ఏవీవీ రాజా, బి.సూర్యనారాయణ, సూపర్‌వైజర్లు ఎం.శ్రీనివాసరావు, పి.శివప్రసాద్, పి.ఉమ, ఆర్.బాలామణి వైద్యసేవలను పర్యవేక్షించారు. పెదపళ్ల, చింతలూరు, కలవచర్ల, చొప్పెల్ల, చెముడులంక, మడికి, గుమ్మిలేరు, నర్సిపూడి గ్రామాల్లో చిన్నారులకు టీకాలు, బాలింతలకు, గర్భిణులకు ఇంజక్షన్లు అందజేశారు. ధనుర్వాతం, కామెర్లు, క్షయ, పోలియో, డిఫ్తీరియా, కోరింత దగ్గు నివారణకు టీటీ, డీపీటీ, మీజిల్స్, పెంటావాలెంట్, ఎంఆర్, హెపటైటిస్-బీ వ్యాక్సిన్లను అందజేశారు. బాలింతలకు, గర్భిణులకు బలవర్ధక ఔషధాలను, యాంటి బయాటిక్ మందులను అందజేశారు. హెల్త్, అంగన్‌వాడీ, ఆశ సిబ్బంది పాల్గొన్నారు.